

# గోధుమ రంగు కళ్ళు

## అబీజ్

"మీకోసం ఒకావిడ వచ్చింది. కన్సల్టింగ్ రూంలో కూర్చోబెట్టాను." అన్న శ్రీమతి పిలుపుతో చదువుతున్న సైకో జర్నల్ మూసి తలెత్తాను.

"ఎవ్వరు?"

"రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ ఆనందరావుగారి భార్యట. ఇదివరకే రెండు మూడుసార్లు మీకోసం వాకబ్ జేసింది."

సాలోచనగా తలూపుతూ లేచి కన్సల్టింగ్ రూంలోకి నడిచాను. టీపాయ్ మీద పత్రిక తిరిగేస్తూ కూర్చున్న ఆవిడ నన్ను చూడగానే పైట నిండుగా కప్పుకుంటూ లేచి నమస్కరించింది.

ప్రతి నమస్కారం జేసి, "కూర్చోండి!" అంటూ ఆమె కెదురుగా సోఫాలో చతికిలబడ్డాను.

ఆమె కూర్చుని, "నా పేరు ప్రతిమాదేవి! మిమ్మల్ని కలుసుకోవాలని చాలా రోజుల్నించీ ప్రయత్నిస్తున్నాను. పని మీద మీరు విశాఖపట్నం వెళ్ళారని తెలిసింది. ఈ ఉదయమే తిరిగి వచ్చారని విని వెంటనే బైలుదేరాను. మనస్తత్వ శాస్త్రవేత్తగా మీకున్న పేరు ప్రఖ్యాతులు విని, ఎలాగైనా మిమ్మల్ని కలుసుకోవాలనిపించింది. ఇప్పటికే జాప్యం జరిగిపోయింది. ఐనా, మీ ద్వారా నా సమస్య తప్పక పరిష్కారమౌతుందన్న నమ్మకం ఉంది నాకు." అంది.

"విషయం చెప్పండి!" అన్నాను ఆమెని పరీక్షగా చూస్తూ. సుమారు ఏభై మూడేళ్ళుంటాయామెకు. రంగూ, రూపు రేఖలనుబట్టి యవ్వనంలో గొప్ప సౌందర్యవతి అయుండాలని అంచనా వేసుకున్నాను. మాట తీరుబట్టి బాగా చదువుకున్న మనిషిలా కనిపిస్తోంది.

"నా భర్త ప్రస్తుతం చాలా దయనీయ స్థితిలో ఉన్నారు. ఆయన ఇక అట్టే కాలం బ్రతకరని తెలిసినా, మునిగేవాడు గడ్డిపరక పట్టుకుని ప్రాణాలు కాపాడుకోడానికి ప్రయత్నించడం సహజం గనక, ఇలా వచ్చాను. నేను కలుసుకోని డాక్టర్ లేడు. అందరూ ఆయన్ని పరీక్షించి, కొన్నాళ్ళు వైద్యంజేసి పెదవి విరిచినవారే! ఆయన జబ్బేమిటో ఎవ్వరికీ సరైన అవగాహన ఏర్పడలేదు. అది మానసిక రుగ్మతా, మనోవైకల్యం అని కొందరు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. నిజానికి నా అనుమానం కూడా అదే!" అంది ప్రతిమాదేవి.

"ఎంత కాలం నించీ ఆయన ఇలా బాధపడుతున్నారు?"

"సుమారు ఏడాది కావస్తోంది."

"ఆయన రిటైరై ఎన్నాళ్ళవుతోంది?"

"ఆరేళ్ళవుతోం దనుకుంటాను."

"ఆయన మానసిక రుగ్మతకు గురయ్యారని మీరెలా అనుమానిస్తున్నారు?"

"ఆయన ప్రవర్తనని బట్టి! అప్పుడప్పుడూ ఒంటరిగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంటారు. అప్పుడాయనకు మిగతా ప్రపంచపు ధ్యాసే ఉండదు. ఆ అర్ధ సుషుప్తావస్థలోనే ఇలా పలవరిస్తుంటారు. 'ఎవ్వరు నువ్వు?.... పలకవేం?.... ఎందుకిలా నన్ను వెంటాడి వేధిస్తున్నావు?.... ఏం కావాలి నీకు?.... వెళ్ళు.... వెంటనే వెళ్ళిక్కణ్నించి....' అంటూ గావుకేకలు పెడతారు.

ఏం జరిగిందని ఎన్ని విధాల ప్రశ్నించినా బదులివ్వరు. ఒక్కోసారి అర్ధరాత్రి నిద్దరలోంచి ఒక్క ఉదుటున లేచి కూర్చుంటారు. శూన్యంలోకి భయభ్రాంతులతో చూస్తూ, '....అదుగో.... అదుగో.... ఆ కళ్ళు.... ఆ కళ్ళు నన్నే చూస్తున్నాయి.... కన్నార్పకుండా నన్నే గమనిస్తున్నాయి.... నా మనశ్శాంతిని హరించివేస్తున్నాయి.... వాటి బారినించి ఎలా తప్పించుకోను?.... ఎలా?.... ఎలా?.... అంతే! ఆ తరవాత మూర్ఛపోతారు. అప్పుడు నేను పడే ఆందోళనా, ఆవేదనా మాటలతో వ్యక్తం చెయ్యలేను. మనస్తత్వ శాస్త్రంలో ఎంతో ప్రావీణ్యం ఉన్నవారని విన్నాను. మీ ద్వారా మానసిక రోగులెందరో మళ్ళీ మామూలు మనుషులయ్యారని విన్నాను. ఫీజు విషయంలో మీరేమీ సంకోచించవద్దు. నాకు మావారు దక్కితే చాలు. ఒక్కసారి మా ఇంటికి వచ్చి ఆయన్ని పరీక్షించండి," అంది ప్రతిమాదేవి వేడుకోలుగా.

"ఆల్‌రైట్! రేపు సాయంత్రం ఆరు గంటలకు వచ్చి చూస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి." అన్నాను.

శ్రీమతి కాఫీ ట్రేతో లోపలికి వచ్చింది.

కాఫీ తాగుతూ, బుక్ షెల్ఫ్ మీద వెండి ఫ్రేంలో ఉన్న ఫోటో వైపు చూసి- "ఆ ఫోటో ఎవరిది?" అడిగింది ప్రతిమాదేవి.

"మా అక్కయ్యది!"

"చాలా బావుంది! అందమైన గులాబితోట. ఆ తోట మధ్య ఆమె. ఆమె చుట్టూ విరబూసిన గులాబీలు. చాలా అద్భుత దృశ్యం! ఎప్పుడు తీశారీ ఫోటో?"

"పాతికేళ్ళ క్రితం! అప్పుడామె పద్దెనిమిదేళ్ళ యువతి!"

"ఓహో! చాలా పాత జ్ఞాపక చిహ్నమన్న మాట! ఎక్కడుంది ఆవిడ ఇప్పుడు?"

"దూరం! చాలా దూరం! ఇంత వరకూ ఎవ్వరూ కనిపెట్టలేని దూరం! మళ్ళీ ఎన్నడూ తిరిగిరాని దూరం....!" నా కళ్ళు చెమర్చాయి.

"సారీ, అయామ్ వెరీ సారీ! చెదిరిపోయిన గతాన్ని తట్టి లేపాను. భగవంతుడు ఇంత అందమైన పుష్పాలను మనకు బహుమతిగా సృష్టించి, అవి ఇంకా గుబాళించక ముందే ఎందుకు నలిపివేస్తాడో అర్థం కాదు!" అంది ప్రతిమాదేవి బాధగా.

నిట్టూర్చాను. "భగవంతుడు వాటిని సృష్టించేది సుగంధ పరిమళాలు వెదజల్లడానికే! అవి ఇంకా గుబాళించక ముందు నలిపివేసేది భగవంతుడి పవిత్ర హస్తాలు కావు. మలినమైన మానవ హస్తాలు! అందుకు భగవంతుణ్ణి నిందించడం భావ్యం కాదు!...."

ఆవిడ నా స్థితి గమనించి, టాపిక్ మార్చేసింది. కాసేపు మా మధ్య ఆ విషయాలూ, ఈ విషయాలూ దొర్లిపోయాయి. తరవాత ఆవిడ సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. పోతూ తమ విజిటింగ్ కార్డు ఇచ్చింది.

మర్నాడు సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బైలుదేరాను వాళ్ళింటికి. ప్రతిమాదేవి నా కోసమే ఎదురు చూస్తున్నట్టు లాన్‌లో పచార్లు జేస్తోంది. నన్ను చూడగానే సాదరంగా ఆహ్వానించి లోనికి తీసికెళ్ళింది.

ఆమె భర్త ఆనందరావు ఓ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. చాలా నీరసంగా, బలహీనంగా కనిపిస్తున్నాడు. మంచం మీద పడుకునే జీవం లేని స్వరంతో నన్ను ఆహ్వానించేడు.

సుమారు ఏభై అయిదూ, అరవై దరిదాపుల ఉంటాడనిపించింది. మొత్తానికి యవ్వనంలో ఆయన చాలా అందగాడూ ఆరోగ్యవంతుడూ అయుండాలి. పైకి దువ్వుకున్న తెల్లని ఉంగారాల జుత్తు, సన్నని కోటేరు ముక్కు, విశాలమైన కళ్ళు, ఆ కళ్ళల్లోని గాంభీర్యం, నుదుటి మీది ముడతలూ ఆయన జీవితానుభవాలకి ప్రతీకలుగా కనిపిస్తున్నాయి.

ప్రతిమాదేవి మమ్మల్ని పరస్పరం పరిచయం చేసింది. ఆయనకు షేక్ హాండ్ ఇచ్చి, మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని, కాసేపు మాట్లాడి, ప్రాథమిక పరిశీలన జరిపాను. దాంతో ఆయన ఫోబియా ఏమిటో అర్థమైపోయింది నాకు.

"ఆనందరావుగారూ! ఆ కళ్ళంటే మీకెందుకంత భయం? అవి మిమ్మల్ని తీక్షణంగా చూస్తే మీరూ అలాగే చూడండి. బెదిరిపోతే అవి మిమ్మల్ని ఇంకా భయపెడతాయి. ఐనా, అవి మిమ్మల్ని తినెయ్యవుగా? అంతగా భయపడటానికి!"

"నో. నో! అలా చెయ్యలేను. అంత ధైర్యంలేదు నాకు!" అన్నాడాయన నీరసంగా.

"ఎందుకు? నేనూ అలాటి కళ్ళను చాలాసార్లుచూశాను. వాటికి నేనెప్పుడలా భయపడలేదే?" అన్నాను సైకియాట్రిస్ట్ ధోరణిలో.

"కావచ్చు! కానీ నేను చూసే కళ్ళల్లో కనిపించే అనూహ్యమైన ప్రశ్న మీకు కనిపించి ఉండదు. ఆ ప్రశ్నలో అంతులేని గాంభీర్యం ఉంది. నిశ్శబ్దం ఉంది. హృదయ వైరాగ్యం ఉంది. ఆ ప్రశ్నకేం జవాబివ్వాలో అంతుబట్టకే నేనింతగా భయపడుతుంటాను."

"అవి చాలా అందమైన కళ్ళయి వుంటాయి! ఔనా?"

"అంటే, స్త్రీ కళ్ళన్న మాట!"

"ఔను!"

"వాటి రంగు ఎలా ఉంటుంది? ఐ మీన్, అవి పిల్లికళ్ళా? నీలి కళ్ళా? నల్లని కళ్ళా?"

"కాదు! అవి గోధుమరంగు కళ్ళు!"

"ఆల్‌రైట్! ఇక మీ జ్ఞాపకశక్తికి పని కల్పించండి. అటువంటి కళ్ళను మీ జీవితంలో ఎక్కడో చూశారు. ఎక్కడ? ఎప్పుడు? జ్ఞాపకంచేసుకోడానికి ప్రయత్నించండి. అప్పుడే మీ జబ్బు విషయంలో నాకో అవగాహన ఏర్పడటానికి అవకాశం కలుగుతుంది."

ఆయన భ్రుకుటి ముడివడింది. కాసేపు శూన్యంలోకి చూస్తూ తీవ్రంగా ఆలోచించి, తలూపాడు. "నిజమే! నా జీవితంలో ఎక్కడో ఆ కళ్ళను చూసినట్టు లీలగా స్ఫురిస్తోంది. ఐతే, ఎక్కడ? ఎప్పుడు? ఎవరివి? అన్నదే స్పష్టంగా జ్ఞాపకం రావడం లేదు!"

"మీ జీవితంలో జరిగిన ముఖ్య ఘటనలు, అంటే - బాల్యంలోనూ, యవ్వనంలోనూ, ఈ వృద్ధాప్యంవరకూ జరిగిన సంఘటనలు మీకు గుర్తులేవా?"

ఆనందరావు పెదవి విరిచాడు. "ఇన్నేళ్ళ జీవన యాత్రలో ముఖ్యమైన సంఘటనలెన్నో జరిగాయి. ఐతే, అన్నీ జ్ఞాపకం పెట్టుకోవడం అందరికీ సాధ్యం

కాదు. తీరికలేని ఈ జీవనయాత్రలో నేను ప్రశాంతంగా జీవిస్తున్న రోజులంటూ ఉంటే అవి ఇవే!"

"ఆల్‌రైట్! దయచేసి ఈ ప్రశ్నకు మొహమాటం లేకుండా జవాబివ్వాలి. మీ భార్యాభర్తల మధ్య ఏమైనా మన స్పర్థలున్నాయా? దాంపత్యం సాఫీగానే సాగుతోందా? పొరపొచ్చాలూ, భేదాభిప్రాయాలూ...."

నా మాట పూర్తి కాకముందే మధ్యలో అందుకుంది ప్రతిమాదేవి.

"అలాంటివేమీ లేవు డాక్టర్! మా దాంపత్య జీవితంలో పౌర్ణమి వెన్నెల తప్ప స్పర్థలనే చీకటిమబ్బు లెప్పుడూ ముసురుకోలేదు. లోటు అనే పదానికి అర్థం ఏమిటో నాకు తెలియనివ్వకుండా చూసుకున్నారాయన. మా కింతవరకూ సంతానం కలగలేదు. అన్నీ ఇచ్చి ఆ విధంగా మాకు తీరని లోటుచేశాడు భగవంతుడు.

"ఐనా, వారు నన్నెప్పుడూ కించపరచలేదు. చులకన జెయ్యలేదు. ప్రేమను కుదించుకోలేదు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం, పిల్లల కోసం ఆయన మళ్ళీ పెళ్లిజేసుకోకపోవడమే. మా వంశం మాతోనే అంతరించకుండా సంతాన లబ్ధికోసం ఆయనకు రెండో పెళ్లి చెయ్యాలని నేనే అనేకసార్లు సంకల్పించాను. అందుకాయన ఎంత మాత్రం ఇష్టపడలేదు."

సాలోచనగా తలూపాను. అప్పుడే తళుక్కుమంది ఓ ఆలోచన. "రావు గారూ! చివరిసారిగా ఈ ప్రశ్న వేస్తున్నాను. చాలా ముఖ్యమైన ప్రశ్న. దాచకుండా జవాబివ్వాలి. యవ్వనంలో మీ రెవ్వరినైనా ప్రేమించడం జరిగిందా?"

ఆనందరావు చిన్నగా నవ్వి తలూపాడు. "ఔను!"

"ఎవ్వర్ని?"

"నా భార్య ప్రతిమని!"

"అంటే, యవ్వనంలో మీ హృదయ కవాటంలోకి ఎవ్వరినీ అడుగు పెట్టనివ్వలే దన్నమాట!" అన్నాను నవ్వుతూ.

ఆయన క్షణకాలం ఆలోచనా సాగరంలో మునిగి, పెదవి విరిచాడు. "నో! అదృష్టవశాత్తూ అలాటిదేమీ జరగలేదు. అందుకే ఆ అదృష్టం ప్రతిమ రూపంలో నన్ను వరించింది. నా ఇష్టానుసారమే మా పెళ్ళి జరిగింది. పెద్దలు నిర్ణయించిన పెళ్లి!"

నేను తీవ్రాలోచనల్లో మునిగిపోయాను. యవ్వనం పాలపొంగు వంటిది. స్త్రీ అయినా, పురుషుడైనా ప్రతి మనిషి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక మలుపులో ఎవ్వరో ఒకర్ని ఆపేక్షించడం, అభిమానించడం, ఆరాధించడం జరుగుతుంది. ఏదీ జరక్కపోయినా, కనీసం 'అటువంటి వ్యక్తి' తన జీవిత సాహచర్యానికి లభించి ఉంటే.... అన్న ఆలోచనైనా వచ్చి తీరుతుంది.

ఆయన బాల్యం విద్యార్జనలోనూ, యవ్వనం ధనార్జనలోనూ విరామ రహితంగా గడిచిపోయింది. అందుకే ఏదో ఒక సందర్భంలో తటస్థపడ్డ ఆ గోధుమరంగు కళ్ళని మర్చిపోయుంటాడు. జవసత్వాలు క్షీణించిన ఈ వృద్ధాప్యంలో అవి వెంటాడుతూ ఆయన మానసిక శాంతిని హరించి వేస్తున్నాయా?

మరో వైపునించి యోచిస్తే, ప్రతి మనిషి వల్లా జీవితంలో - స్వలాభం కోసమైతేనేమి, పొరపాటునైతేనేమి ఎవ్వరో ఒకరికి కొద్దోగొప్పో అన్యాయం జరగడం పరిపాటి. ఆ అన్యాయం ప్రత్యక్షంగానూ కావచ్చు. పరోక్షంగానూ కావచ్చు. ఒక్కోసారి ఆ అన్యాయంవల్ల కొందరి జీవితాలు భస్మీపటలమూ కావచ్చు. ఆ విధంగా ఆనందరావు వల్ల కూడా గతంలో ఏదో ఒక రూపంలో, సందర్భంలో అన్యాయానికి గురైన అభాగిని కళ్ళా అవి?

మొత్తానికి ఆ కళ్ళకూ, ఆయనకూ అవినాభావ బంధమేదో తప్పక ఉండి ఉంటుంది. సైకో హిప్నో థెరపీ ద్వారా ఆయన్ని అర్థసుషుప్తావస్థలోకి తీసికెళ్ళి ఇంతవరకూ ఆయన మస్తిష్కంలో నిద్రాణమై ఉన్న ఆ జ్ఞాపకాలను జాగృతంజేసి, నిజాన్ని రాబట్టడం తప్ప మరో మార్గం లేదు అనుకుంటూ లేచాను.

"ఓ. కే! ఇక నాకు సెలవిప్పించండి. రేపు మళ్ళీ వస్తాను. మన మధ్య జరిగిన సంభాషణను ఒకసారి సమగ్రంగా సమీక్షించి, ఓ నిర్ణయానికి రావాలి!" అంటూ ఆయన దగ్గర సెలవు తీసుకుని బైటికి నడిచాను.

ప్రతిమాదేవి నన్ను సాగనంపడానికి గేటువరకూ వచ్చింది. ఆవిడకు కొన్ని సూచనలిచ్చి, రేపు అదే సమయానికి వస్తానని చెప్పి కారెక్కాను.

## 2

మర్నాడు నా సూచనల మేరకు అన్ని ఏర్పాట్లూ చేసి ఉంచిందావిడ. గదిలో చిరు చీకటి. ఓ గోడవారగా మంచం. ఆ మంచం మీద ఆనందరావు.

ఆయన్ని దిండు నానుకుని వెల్లకిలా పడుకోమని చెప్పి, కొవ్వొత్తి వెలిగించి దూరంగా ఉంచాను. ప్రతిమాదేవిని ఉండమని చెప్పి, తలుపు మూసి మంచం పక్కన కుర్చీలో కూర్చున్నాను.

సైకో హిప్నో థెరపీ ద్వారా ఆయన్ని అర్ధసుషుప్తావస్థలోకి తీసికెళ్ళి నిద్రాణమై ఉన్న ఆయన జ్ఞాపకశక్తిని మేల్కొలిపాను. మానవ మస్తిష్కం వీడియో టేప్‌రికార్డర్ వంటిది. చూసిన ప్రతి దృశ్యాన్నీ, విన్న ప్రతి శబ్దాన్నీ

షేవ్ చేసుకుని తక్షణం తన సెల్స్‌లో భద్రపర్చుకుంటుంది.

ఐతే, వయసు మీరడంవల్ల నైతేనేమి కొన్ని నరాల శక్తి మాంద్యంవల్లనైతే నేమి ఆ సెల్స్‌లో నిక్షిప్తమై ఉన్న శబ్దాలూ, దృశ్యాలూ ఓ పట్టాన వెలికి రావు. జ్ఞాపకాల తెరపై ప్రత్యక్షం కావు....

నా ప్రయత్నం ఫలించింది! నేను వేసే ప్రతి ప్రశ్నకూ ఆయన అతి స్పష్టంగా జవాబిస్తున్నాడు. నా ప్రశ్నలూ ఆయన జవాబులూ చకచకా నోట్ జేసుకోసాగాను. అప్పుడర్థమైంది నాకు ఆయన మానసిక రుగ్మతకి నిర్దుష్టమైన కారణం ఏమిటో!


నా ప్రశ్నలు పూర్తయ్యాక, ఆ జవాబులతో సహా వాటిని ఆయన చెవిలో మరోసారి చదివి వినిపించాను. అవన్నీ వాస్తవాలేనని ఆయన మస్తిష్కం ధృవీకరించింది.

ఆ తరవాత ఆయన్ని వాస్తవ లోకంలోకి తీసుకొచ్చాను. మూర్ఛ లోంచి తేరుకున్నట్టు చిన్నగా మూలుగుతూ కళ్ళుతెరిచి, "సారీ, బాగా నిద్రపోయినట్టున్నాను." అన్నాడు.

"ఔను!" అన్నాను సాధ్యమైనంత సౌమ్యంగా.

ప్రతిమాదేవిని లోనికి పిలిచి, "నా ప్రయోగం విజయవంతమైంది! నెల రోజుల్లో డాక్టర్‌గా మళ్ళీ మామూలు మనిషి కాగలరని హామీ ఇస్తున్నాను. అప్పుడప్పుడూ వచ్చి చూస్తుంటాను." అంటూ వారి దగ్గర సెలవు తీసుకుని వచ్చేశాను.

నా అంచనా తప్పలేదు. నాలుగైదు వారాల్లోనే ఆనందరావు పూర్తిగా కోలుకున్నాడు. మునుపటిలా ఆయన అసహజంగా ప్రవర్తించడంలేదనీ, పలవరించడం లేదనీ, మామూలు-మనిషిలా మసలుకుంటున్నారనీ, నాకు హార్దికాభి



వందనాలూ, కృతజ్ఞతలూ తెల్పుకుంటూ ఎంతో సంతోషాన్ని వ్యక్తంజేసింది ప్రతిమాదేవి.

నాలోని డాక్టర్ సంతృప్తిగా నిశ్వాస వదిలాడు. కాని....

ఆ సాయంత్రం ఆ దంపతుల్ని చివరిసారి పరామర్శించి, ఆ రాత్రి ఎనిమిది గంటల ఫ్లైట్‌లో శ్రీమతితో బెంగళూరు వెళ్ళి అన్నయ్య దగ్గర కొన్నాళ్ళు ప్రశాంతంగా గడిపి రావాలని నిర్ణయించుకుని, వారి ఇంటికెళ్ళాను.

ఆనందరావు ఎంతో సాదరంగా ఆహ్వానించి, లాన్‌లో కుర్చీలు వేయించి కూర్చోబెట్టాడు. ప్రతిమాదేవి కాఫీ కలిపి మా ముందుంచుతూ, "ఇప్పుడు చెప్పండి డాక్టర్! మా వారు ఎందుకలా ప్రవర్తించారో తెలుసుకోవాలన్న జిజ్ఞాస చాలా రోజుల్నించీ నన్ను ఆరాటపెడుతోంది." అంది.

"ఇప్పుడివన్నీ ఎందుకులెండి! కొన్ని విషయాలు తెలియకపోవడమే మంచిది దానివల్ల లేనిపోని కొత్త సమస్యలు ఉత్పన్నం కావచ్చు...." అంటూ మాట మార్చబోయాను.

మధ్యలో అందుకున్నాడు ఆనందరావు. "ఫరవాలేదు డాక్టర్, చెప్పండి! నాకూ తెలుసుకోవాలని చాలా ఉత్కంఠగా ఉంది."

"చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు. ఐతే, నిజం నిప్పులాంటిది గనక, అది మీ మధ్య వైషమ్యాలను రగులుస్తుందేమోనని సంశయిస్తున్నాను."

ప్రతిమాదేవి నవ్వింది. "డాక్టర్! ఇప్పుడు మా వయసు వైషమ్యాలకూ, స్పర్థలకూ అతీతమైనది. పాతికేళ్ళ వైవాహిక బంధంలో అవి మా దరిదాపుల్లో కూడా తొంగిచూడలేదు. మీరు చెప్పే విషయాలు మా మీద ఏ ప్రభావమూ వెయ్యలేవు!"

"కానచ్చు! అవి ఆనందరావు గారి మీద ప్రభావం చూపకపోయినా, మీ మీద చూపే ప్రమాదముంది. కారణం, మీరు స్త్రీ కదా? స్త్రీ సహజమైన ఈర్ష్యా అసూయలూ, రాగద్వేషాలూ మీలోనూ ఉంటాయి కదా?"

"నిజమే! కానీ, నేను చదువుకున్న స్త్రీని! చదువు మనిషికి సంస్కారం నేర్పుతుంది. నా మనసంత సంకుచితం కాదు. ప్లీజ్, చెప్పండి డాక్టర్!"

"ఆల్‌రైట్! మీ రింతగా బలవంత పెడుతుంటే ఇంకా నాన్చడం బావుండదు. వినండి. ఆనందరావుగారూ! ఇన్నాళ్లూ మిమ్మల్ని వెంటాడి, వేధించిన ఆ గోధుమ రంగు కళ్ళు మీ జీవితంలోనే కాదు. మరొకరి జీవితంలోనూ ఎంతో ప్రాముఖ్యాన్ని కలిగిఉన్నాయి.

"సుమారు ముప్పై ఏళ్ళ క్రితం మీరు బి.వి.ఎస్‌సి. డిగ్రీ పుచ్చుకుని, శిక్షణా

నంతరం వెటర్నరీ డాక్టర్‌గా ఓ గ్రామంలో నియుక్తులయ్యారు.... విద్యార్థి దశలోనే ఆడపిల్లల హృదయాలతో ఆడుకుని ఆనందించే ప్రవృత్తి మీది. అందం, ఆరోగ్యవంతమైన శరీరం అందుకు అన్ని విధాలా తోడ్పడేవి మీకు.

"పెదాలపై ఎప్పుడూ చెరగని చిరు దరహాసం, మందస్మిత వదనం అర విరిసిన ఆడపిల్లల్ని అయస్కాంతంలా మీ వైపు లాక్కొని, అందమైన ఆశలు రేపేవి. అక్కర తీరగానే అరటి తొక్కలా వారిని అవతల గిరాటేయడం మీ ఆనవాయితీ!

"ఒకరోజు జబ్బు పడ్డ తన పెంపుడు కుక్కను చూపడానికి మీ ఆస్పత్రికి వచ్చింది ఓ అమ్మాయి. అద్భుతమైన ఆమె అందం క్షణకాలం మిమ్మల్ని విచలితుణ్ణిజేసింది. ముఖ్యంగా ఆమె కళ్ళు విపరీతంగా ఆకట్టుకున్నాయి. అటువంటి అపరూపమైన కళ్ళను బహు అరుదుగా కలిగిఉంటారు కొందరు. అవి గోధుమరంగు కళ్ళు!!

"అంతే! ఆ రోజునించీ ఆ కళ్ళు మీ నిద్రాహారాలను హరించివేశాయి. కుక్కకు ట్రీట్‌మెంట్ ఇప్పించడానికి తన తమ్ముడి వెంట రోజూ వచ్చే ఆమెతో పరిచయాన్ని పెంపొందించుకున్నారు.

"ధైర్యంచేసి ఓరోజు ఆమె తమ్ముడి చేత తొలి ప్రేమలేఖ పంపారు. పల్లెటూరి పిల్ల. సాధ్వి. అమాయకురాలు. మాయలో పడిపోయింది. ఆ రోజు మొదలు ఆమె తమ్ముడు మీ మధ్య ప్రేమలేఖల పోస్ట్‌మెన్ పాత్ర వహించేవాడు.

ఆ తరవాత అతని అవసరం లేకుండానే మీ రిద్దరూ చాటుమాటుగా పున్నమి రాత్రుల్లో, పూదోటల్లో కలుసుకోడం ప్రారంభించారు. పెళ్లిజేసుకుంటానని బాసలుజేసి, ఆమెలో హరివిల్లు వంటి ఆశలు రేపారు. నమ్మింది. గుడ్డిగా నమ్మింది. అక్కర తీరింది. అరటితొక్కగా మారింది....

"అంతే! అక్కణ్ణించి బదిలీ చేయించుకుని అదృశ్యమైపోయారు. అభిసారికలా ఆమె మీ కోసం ఎదురు చూడసాగింది. ఐనవాళ్ళను ఒప్పించి వస్తానని వెళ్లిన మీరు ఐపులేకుండా పోయారు.

క్షణాలూ, నిమిషాలూ, గంటలూ, రోజులూ, నెలలూ కాలగర్భంలో కలిసిపోతున్నాయి. వాటితోబాటు తనగర్భంలో రూపుదిద్దుకుంటున్న మీ అక్రమరూపం ఇక మీరెన్నడూ తిరిగిరారని ఆమెను హెచ్చరించసాగింది. అక్రమ సంతానంగా తన నీ నరకలోకంలోకి తేవద్దని ఆక్రోసించసాగింది. ఆమె కా ఆక్రందనలు వినిపించాయి.

ఒకరోజు కాలుజారినట్టు బావిలో దూకి, భూదేవికి తర్పణం అయిపోయింది. అందమైన తుమ్మెద లాంటి మీరు అదివరకే అటువంటి అర విరిసిన పుష్పాలనెన్నో ఆఘ్రాణించి వదిలేశారు గనక, అందరిలాగే ఆమెను కూడా కాలక్రమేణా మర్చిపోయారు.... తరవాత పెద్దలు నిర్ణయించిన పెళ్ళి చేసుకుని సంసార సాగరంలో స్థిరపడిపోయారు.

"ఇన్నేళ్ళ తరవాత ఈ చరమదశలో మీ మస్తిష్కంలో నిక్షిప్తమై ఉన్న అరుదైన అగరూపమైన ఆ గోధుమ రంగు కళ్ళు మిమ్మల్ని వెంటాడుతూ, ఆ నమ్మకద్రోహానికి సంజాయిషీ అడుగుతూ మీ మనఃశాంతిని హరించివేయసాగాయి.... ప్రతిమాదేవిగారూ! ఆ అమ్మాయి ఎవ్వరో తెలుసా?"

"ఎవ్వరు?" కుతూహలంతో కంపించింది ఆమె కంఠం.

"మా అక్క అనూరాధ! ముగ్గురన్నదమ్ముల ముద్దుల సోదరి.... ఆనాడు మీ మధ్య పోస్ట్‌మెన్‌గా వ్యవహరించిన ఆమె చిన్న తమ్ముడు ఎవ్వరో కాదు డాక్టర్! నేనే!!

"మీ మస్తిష్కంలో నిద్రాణమైఉన్న ఈ వాస్తవాలను ఎప్పుడైతే వెలికితీశానో అప్పుడు నా గుండెలో బద్దలైన అగ్ని పర్వతాలు నాకూ, ఆ భగవంతుడికీ ఇద్దరికే తెలుసు. ఆ క్షణమే నా శరీరంలోని ప్రతి సూక్ష్మగ్రంధీ సల సల మరిగే లావాను ఎగజిమ్ముతూ మీపై ప్రతీకార వాంఛను ప్రజ్వలింపజేసింది.

"ఐతే, నాలోని డాక్టర్ అందుకు తీవ్ర తిరస్కారాన్ని తెలిపాడు. ఒక డాక్టర్‌గా సాటి మనిషి ప్రాణాలను రక్షించడం తప్ప, భక్షించే అధికారం నాకు లేదని పదే పదే హెచ్చరించసాగాడు. ఆ రోజు మొదట నాలో తీవ్రమైన సంఘర్షణలో చివరికి నాలోని వైద్యుడే జయించాడు...."

లేచి నిల్చున్నాను. "ఒక డాక్టర్‌గా నేను మిమ్మల్ని క్షమించగలిగాను కానీ ఒక సామాన్య మానవునిగా నేను మిమ్మల్ని క్షమించలేను డాక్టర్! ఎన్నటికీ క్షమించలేను...." అంటూ ఆ దంపతుల్ని దిగ్భ్రాంతిలో ముంచేసి అడుగులో అడుగు వేసుకుంటూ గేటు వైపు నడిచాను.